# నేటి నుంచి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

-ప్రతిరోజూ రెండు గ్రామాల్లో శిబిరాల నిర్వహణ

-డివిజన్‌లోని 15 మండలాలకు మందుల సరఫరా




ఉరవకొండలోని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి చేరిన మందుల దృశ్యం, పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్

**ఉరవకొండ, జనవరి 19 ప్రభాతవార్త**

నేటి నుంచి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు జరుగనున్నాయి. పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డివిజన్ పరిధిలో 15 మండలాలు ఉండగా ప్రతిరోజూ ఒక్కో మండలంలో రెండు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ మాట్లాడుతూ డివిజన్ కేంద్రానికి సరఫరా అయిన మందులను 15 మండలాలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలాల్లో ప్రతి రోజూ రెండు గ్రామాల్లో పశు వైద్యులు, సిబ్బందితో కూడిన రెండు బృందాలు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తాయని ఇందులో పశువులను పరీక్షించి ఉచితంగా వైద్య అందించడం జరుగుతుందన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని, ఎదకురాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఎదలో ఉన్న పశువులను గుర్తించి కృత్రిమ గర్భాధారణ చేయడం, చూడి పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పశువులకు, దూడలకు, సన్నజీవాలకు నట్టల మందు ఉచితంగా తాగించడం జరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు జీవాలు, దూడలకు తాగించడంవల్ల బరువు పెరిగి అవి ఆరోగ్యంగా ఉండటమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి, పాల ఉత్పత్తి, పునరుత్పత్తి మెరుగుపడుతుందన్నారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో సామూహికంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గొర్రెలు, మేకలకు ఉచితంగా బొబ్బవ్యాధి నివారణ టీకాలు అందిస్తామని తద్వారా సన్న జీవాలలో వ్యాధి నిరోధక శక్తితోపాటు పెరుగుదల, పునరుత్పత్తి సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. పశు ఆరోగ్య శిబిరాల్లో పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై, పశు విజ్ఞానంపై అవగాహన సదస్సులను నిష్ణాతులైన పశు వైద్యులచే నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించడంలోపాటు పశుసంవర్థన రంగాన్ని మరింత మెరుగుపర్చే క్రమంలో వివిధ నూతన పథకాలను ప్రవేశపెట్టి తోడ్పాటును అందించడానికి గోకులం, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశు బీమా, రాయితీపై ఇన్‌పుట్స్ సరఫరా, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు, లింగనిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం వంటి పథకాల గూర్చి తెలియజేయడం జరుగుతుందని డీడీ డాక్టర్ జి.వెంకటేష్ వివరించారు. పాడి రైతులు పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా ఆదినాతస్వామి 1008వ సంవత్సర వేడుకలు

- వేడుకల్లో కళిశాలను మోసిన మహిళలు



ఆదినాథస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం


**అగళి, జనవరి 19 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అగళిలో పురాతన జైన మతానికి చెందిన ఆదినాథస్వామి 1008వ సంవత్సరం వేడుకలను జైన గురువులచే ఘనంగా నిర్వహించారు. ఆలయంతోపాటు ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. ఆదినాథ స్వామి మూల విరాట్‌ను జైన గురువులచే అభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు ఆదినాథస్వామికి కళిశాలను పట్టి పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే వేడుకలను ప్రారంభించారు. జైన మతం అహింసకు మారుపేరు. చీమలను సైతం చంపని జాతి. పురాతన జైన మత వేడుకలకు కర్ణాటక రాష్ట్రం తుమకూరు, బెంగుళూరు చిత్రదుర్గ దావనగెర, పెనుకొండ, అమరాపురం,రత్నగిరి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆదినాథస్వామి వేడుకలకు హాజరయ్యారు. తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, జైన మత మంత్రాలతో గురువులు పూజలు నిర్వహించారు. వారు మత ఆచారాల ప్రకారం పూజలు నిర్వహించిన అంతరం పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతితో పూజలను ముగించారు. హాజరైన భక్తులతోపాటు గ్రామస్తులకు సైతం ప్రసాదాన్ని ఆదినాథస్వామి ఆలయ మండలివారు వితరణ చేశారు.

# నేటి నుంచి వ్యాసాపురం గ్రామంలో భూముల రీసర్వే

-అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 4 నెలలపాటు కొనసాగనున్న సర్వే-వందేళ్ల తరువాత నిర్వహిస్తున్న భూముల రీసర్వేకు అన్ని ఏర్పాట్లు

**ఉరవకొండ, జనవరి 19 ప్రభాతవార్త**




వ్యాసాపురం గ్రామంలో భూముల వివరాలు తెలిపే మ్యాప్

పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఉరవకొండ మండల పరిధిలోని వ్యాసాపురం గ్రామంలో నేటి నుంచి భూముల రీసర్వే ప్రారంభం కానుంది. 1910-25 మధ్య కాలంలో బ్రిటీష్ పాలకులు భూములను సర్వే చేయించగా 100 సంవత్సరాల తరువాత మళ్లీ భూముల సర్వే జరుగనుంది. సర్వేను పకడ్బందీగా పూర్తీ చేయడానికి రెవెన్యూ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జీపీఎస్ సిస్టం ద్వారా అంక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా 4 నెలలపాటు రీసర్వే కొనసాగనుంది. వ్యాసాపురం గ్రామంలో 144 సర్వే నంబర్లలో మొత్తం 2,618.85 ఎకరాల భూమి ఉండగా 468 మంది పట్టాదారులు ఉన్నారు. భూముల అక్రమాలకు చెక్ పెట్టి స్వచ్ఛమైన భూముల రికార్డులను తయారు చేయడానికిగాను గత ప్రభుత్వ 2023-24 మధ్య భూముల రీసర్వే చేపట్టింది. మొదటి విడతలో మండలంలోని మోపిడి, ఇంద్రావతి, కోనాపురం, వెలిగొండ, రేణిమాకులపల్లి గ్రామాల్లో రీ సర్వే నిర్వహించారు. రెండవ విడతలో భాగంగా వ్యాసాపురం గ్రామంలో రీసర్వే జరుగనుండగా పట్టాదారుల సమక్షంలో ఎక్కడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా నిర్వహించనున్నారు. ఇకపై ఎఫ్‌ఎంబీ ఉండదని, ఎల్‌పీఎం నంబర్ వస్తుందని సర్వే నంబర్ల సబ్ డివిజన్లు కూడా ఉండదని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎంత భూమి ఉందో అంతే భూమి రికార్డుల్లో ఉంటుందని అంటున్నారు.

# ఘనంగా ఒణికే ఓబవ్వ జయంతి వేడుకలు

ముఖ్య అతిథులుగా ఎంఎల్ఏ, మాజీ ఎంఎల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ రాజు

**గుడిబండ జనవరి 19 ప్రభాతవార్త:**

కర్నాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ కోట సామంతరాజుల రాజ్యాన్ని శత్రు సైన్యం నుండి కాపాడేందుకు వీరోచిత పోరాటాన్ని చేసిన వీరవనిత ఓబవ్వ ధైర్యసాహసాలు కొనియాడదగినవని,ఓబవ్వ పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మడకశిర ఎంఎల్ఏ,టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు అన్నారు. గుడిబండ మండల పరిధిలోని మందలపల్లి



సభకు హాజరైన ప్రజలు

గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఓబవ్వ జయంతి కార్యక్రమానికి ఎంఎల్ఏ ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎస్ రాజు మాట్లాడుతూ పల్నాడు సైన్యాధ్యక్షుడు మాల వీర కన్నమదాసు, ఓబవ్వ వంటి పోరాట వీరుల చరిత్రను తెలియజేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓబవ్వ జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహకులను కోరారు.మాల కళాకారులకు పెన్షన్ అందించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఏ దళిత కాలనీలోను సీసీ రోడ్లు లేకుండా ఉండకూడదని,సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో త్వరితగతిన రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళిత కాలనీల్లో మోలిక సదుపాయాలు, మంచినీటి వ్యవస్థ, పాఠశాలలు అన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్,డైరెక్టర్ కమలమ్మ,మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాల తాలూకా అధ్యక్షులు పాండురంగప్ప, బసవరాజు, సోమకుమార్, తెదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప,దాసిరెడ్డి,సర్పంచ్ లక్ష్మీనారాయణ, కాచికుంటవెంకటేష్ తదితర మాల సోదరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

**బత్తలపల్లి, జనవరి 19 ప్రభాతవార్త**

పశువులకు, గొర్రెలు, మేకలకు నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాలలో వారు విలేకర్లతో మాట్లాడారు. నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పశువైద్య సిబ్బంది గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో అనారోగ్యంతో బాధపడుతున్న పశువులకు పరీక్షలు చేసి వైద్యం చేస్తారన్నారు. గర్భకోశ చికిత్సలు, పాడి ఆవులకు, దూడలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా తాపిస్తామన్నారు. రెండు బృందాలుగా విడిపోయి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశం రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. 20న బత్తలపల్లి, గంటాపురం, ఈదుల ముష్టూరు పంచాయతీల్లోనూ, 21న పోట్లమర్రి, వేల్పుమడుగు. సంజీవపురం, 22న మాల్యవంతం. 23న తంబాపురం, 24న అప్పరాచెరువు. 26న సంగాల, 27న ఓబుళాపురం, 28న గరిశలపల్లి, 29న దంపెట్ల, 30న డి. చెర్లోపల్లి, 31న నల్లబోయనపల్లి పంచాయతీలల్లోనూ పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా యోగి వేమన జయంతి




యోగివేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**బత్తలపల్లి, జనవరి 19 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.. కార్యాలయ ఏఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగి వేమన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన పద్యాలు, జీవిత చరిత్ర గురించి వివరించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంగళవారం నుండి దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

**బత్తలపల్లి, జనవరి 19 ప్రభాతవార్త**

నేటి నుంచి దివ్యాంగుల పింఛన్ల పరిశీలన కార్యక్రమం చేపట్టాల్సి ఉండగా రేపటి నుంచి పరిశీలన. కార్యక్రమంను వాయిదా వేసినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా తెలిపిన సమాచారం ప్రకారం 20వ తేదీ జరగాల్సిన పరిశీలన 21వ తేదీకి, 21వ తేదీ జరగాల్సిన పరిశీలన 22వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కావున ఆయా తేదీలలో పింఛన్లుదారులు తమ దివ్యాంగత్వంను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

# ఈనెల 20న ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు

**కొత్తచెరువు జనవరి 19. ప్రభాతవార్త.**

శ్రీ సత్య సాయి జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించబడతాయని డిఐఈ ఓ రఘునాథ్ రెడ్డి తెలిపారు అలాగే వచ్చేనెల ఫిబ్రవరి ఒకటో తేదీ ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ , జనవరి మూడో తేదీ సోమవారం ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించబడును మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

# మహిళపై దాడి, జుట్టు కత్తిరించిన కేసులో 11 మంది అరెస్ట్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

**పెనుకొండ జనవరి 19 ప్రభాతవార్త**

మండల పరిధిలో మునిమడుగు గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం మహిళపై దాడి చేసి జడ కత్తిరించిన ఘటన లో ఆదివారం 11 మందిని అరెస్టు చేసినట్లు డిఎస్పి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత కేసులో అప్పటిలో20 మందిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. శనివారం రాత్రి కియా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ వారి సిబ్బంది మనిమడుగు గ్రామంలో ఎస్సీ కాలనీలో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. అరెస్టు చేసిన ముద్దాయిలను అనంతపురం జిల్లా జైలుకు తరలించామన్నారు. మిగిలిన తొమ్మిది మంది ముద్దాయిల లు పరారీ లో ఉన్నారని వారి ని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలును నియమించామన్నారు. ప్రత్యేక బృందాలు తీవ్ర గాలింపు చర్యలు చేపడుతున్నారని, త్వరలోనే ముద్దాయిలను పట్టుకుంటామన్నారు. సంఘటనపై వెంటనే దర్యాప్తు చేపట్టి ముద్దాయిలను అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ వి రత్న తమను ఆదేశించిందన్నారు కేసును సీరియస్ గా తీసుకొని, తగినంత త్వరగా 11 మంది ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మహిళపై దాడి జడ కత్తిరించడానికి కారణాలు వివరిస్తూ మరో సంఘటనను డి.ఎస్.పి వెంకటేశ్వర్లు ఇలా వివరించారు. మునిమడుగు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక తప్పిపోయిందని అమ్మాయి తల్లిదండ్రులు ఈనెల 10వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. సంబంధిత కేసుకు సంబంధించి పోలీసులు తక్షణమే కేసును సీరియస్. గా తీసుకొని రెండు రోజుల వ్యవధిలోనే ప్రేమ జంటను పట్టుకొని అందులో అమ్మాయిని ఆమె తల్లిదండ్రులకు అప్ప చెప్పడం జరిగిందన్నారు ఆ కేసులో అమ్మాయి మైనర్ కావడంతో అదే గ్రామానికి చెందిన అనిల్ అనే అబ్బాయి అమ్మాయి కి మాయ మాటలు చెప్పి వెంట తీసుకెళ్లారని అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఆ యువకుడు పై ఈనెల 12వ తేదీన ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. అయితే ప్రేమ జంట పారిపోవడాని బాధిత మహిళే కారణమని బాలిక కుటుంబ సభ్యులు భావించి మహిళపై దాడి చేసి ,జడ కత్తిరించడం జరిగిందన్నారు. కేసులో చాకచక్యంగా త్వరలో అరెస్టు చేయడం పై సిఐ రాఘవన్ ఎస్ఐ రాజేష్ లు ను డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

# గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్లు విధ్వంసం సాగింది ..!

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్

**మడకశిర టౌన్ జనవరి 19 ప్రభాతవార్త,**

గత ఐదేళ్ల జగన్ రెడ్డి యొక్క వైసిపి ప్రభుత్వ విధ్వంస పాలన వల్ల మూడు దశాబ్దాల పాటు మాలలు వెనక్కి వెళ్లారని ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ తెలిపారు, మడకశిర పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంకరి కమలమ్మ, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రాధమ్మ రాజులు మాట్లాడుతూ :బాబా సాహెబ్ అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాన్ని జగనన్న విదేశీ విద్యా పథకంగా పేరు మార్చి బాబాసాహెబ్ ను అవమానించారని జగన్ పాలన పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీల అభ్యున్నతి కోసం ఉన్న 25 పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి బాబా సాహెబ్ అంబేద్కర్ విదేశీ విద్య నిధి పథకంగా పేరు మార్చి అంబేద్కర్ ను గౌరవించారని తెలిపారు. ఎస్సీ మాల కార్పొరేషన్ ద్వారా రైతులకు రైతులు, రైతు కూలీలకు యాంత్రీకరణ పనిముట్లను సబ్సిడీ రూపంలో త్వరలో ఇవ్వనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల కమ్యూనిటీ తాలూకా అధ్యక్షుడు పాండురంగప్ప, కార్యదర్శి సోంకుమార్, మాల మహానాడు బిజెపి కోఆర్డినేటర్ బసవరాజు, ఉరుము కళాకారుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పూలకుంట మూర్తి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గడ్డం ముత్యాలప్ప, జనసేన జిల్లా కార్యదర్శి ముత్యాలు, మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట్ల గంగాధర్, పాల్గొన్నారు.

# ఆదర్శ ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు ఐటిపై అవగాహన

**అమరాపురం జనవరి 19 ప్రభాతవార్త**



శిక్షణ పాల్గొన్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు దృశ్యం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఐటీ పై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఓబులపతి ఆధ్వర్యం లో అవగాహన సదస్సు ను నిర్వహించారు. సంక్రాంతి సెలవుల్లో పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నందు ఒకేషనల్ ట్రైనర్ మంజునాథ్ సమక్షంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఒకేషనల్ విద్యార్థులకు సమగ్ర సర్వ శిక్ష అభియాన్, ఇండస్ట్రీస్ ,ఎడ్యుకేషన్ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటీ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా ఒకేషనల్ కోర్సు నుప్రాథమిక స్థాయి నుంచి ప్రవేశపెట్టి విద్యార్థులకు ఐటీ మరియు పరిశ్రమలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి ప్రయోజకులు గా సమాజంలో గుర్తింపు పొందుతారని తెలిపారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రభుత్వ రంగంలో కానీ ప్రైవేట్ రంగంలో కానీ కీలక పాత్ర వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం విద్యార్థులకు వివిధ పథకాలపై శిక్షణ, ఉపాధి, ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం వంటి కార్యక్రమాలపై మండల కేంద్రంలోని మీసేవ తదితర కేంద్రాల వద్ద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన సందర్భంగా సర్టిఫికెట్లు కూడా అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

# రాయలసీమ ప్రాజెక్టులపై వివక్ష తగదు

**గుంతకల్లు, జనవరి 19 ప్రభాతవార్త**



సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

రాయలసీమ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న వివక్ష తగదని వక్తలు పేర్కొన్నారు. జలసాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బీరప్పగుడి కళ్యాణమండపంలో రాయలసీమ ప్రాజెక్టులపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి బి.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి జలసాధన సమితి నాయకులు శ్రీనివాసులు, పౌరప్రగతిశీలవేదిక కార్యదర్శి తారకేష్ మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను ప్రారంభించి నేటికి 35 ఏళ్లు గడిచినా ప్రాజెక్ట్ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా ప్రాజెక్టులు మాత్రం పూర్తి కావడంలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పరిమితం చేసి జీడిపల్లి రిజర్వాయర్ నుండి చిత్తూరు వరకు ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేయడానికి 404, 405 జిఒలను విడుదల చేసి ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేయడానికి పూనుకోవడం జరిగిందన్నారు. 6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో లైనింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలకులు రాయలసీమ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి కోస్తా ప్రాంతానికి ఎక్కువ నిధులు కేటాయిస్తుండడం ప్రజలు గమనించాలన్నారు. హంద్రీనీవాకు ఎక్కువ నిధులు కేటాయించి జిల్లాలోని 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి రాయలసీమ నదీ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది నాగరాజు, దావీదు, ఆశాబీ, జిలాన్, సత్తార్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీయోగివేమన జయంతి



యోగివేమన జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 19 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలో ఆదివారం శ్రీయోగివేమన 658వ జయంతి వేడుకలను వేమన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. త్వరలో పట్టణంలో వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆయన జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జయరాంరెడ్డి, ఎంపిపి విశాలాక్షి, శారద, నరసింహులు, వెంకట్రామిరెడ్డి, సుభాష్‌రెడ్డి, విజయభాస్కర్‌చౌదరి, రాజశేఖర్‌రెడ్డి, చిన్నవెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

# గవిమఠ సంస్థానం, బూదగవి విడిది మఠంలో అభివృద్ధి పనులు

-క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు రూపొంధించిన ఇంజనీరింగ్ అధికారి

**ఉరవకొండ, జనవరి 19 ప్రభాతవార్త**



మఠం ఉత్తరాధికారి జగద్గురు కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమీషనర్ కె.రాణితో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ మహేంద్ర

పట్టణంలోని ప్రసిద్ధ గవిమఠ సంస్థానంతో పాటు మండల పరిధిలోని బూదగవి గ్రామంలో గల విడిది మఠంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇందుకోసం దేవాదాయ శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. గవిమఠ సంస్థానం సహాయ కమీషనర్ కె.రాణి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అసిస్టెంట్ ఇంజనీర్ మహేంద్ర ఆయా మఠాలను పరిశీలించి గదుల పైకప్పులు, గద్దెలవద్ద ఫ్లోరింగ్, ప్రహరీగోడ ఇతరత్రా పనులను చేపట్టడానికి అంచనాలు రూపొందించారు. మఠం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి సహాయ కమీషనర్, ఏఇలకు మఠంలో చేపట్టాల్సిన వివిధ పనులపై సూచనలు చేశారు. ఈ పనులు మార్చి నెలలో జరిగే చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల లోపు పూర్తీ అయితే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మఠం ఏజెంటు పి.రాజన్నగౌడ్, జూనియర్ అసిస్టెంట్లు నారాయణస్వామి, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



వివరాలను నమోదు చేసుకుంటున్న ఏఇ

# కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

-ఉరవకొండలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు సీపీఐ, కాంగ్రెస్ నిరసన

**ఉరవకొండ, జనవరి 19 ప్రభాతవార్త**

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామాచేసి దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. భారత పార్లమెంట్ సాక్షిగా భారతరత్న, రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పట్ల అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరశిస్తూ ఆదివారం ఉరవకొండ పట్టణంలోని ప్రధాన కూడలిలోగల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు ఆయా పార్టీల శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జె.మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా శీనా, ఉపాధ్యక్షులు బ్యాళ్ళ శివప్రసాద్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ రహిమాన్ తదితరులు మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంట్‌లో మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరును అనేకమార్లు సంబోధించాల్సిన అవసరంలేదని దానికి బదులు దేవుడిని తలుచుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని కించపరిచే విధంగా మాట్లాడి క్షమించరాని తప్పు చేశారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తి దేశంలో బీజేపీ ను నడిపిస్తోందని, రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. దేశంలో బడుగు, బలహీన వర్గాలు ఆరాదించే దైవం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని అలాంటి మహోన్నత వ్యక్తిని అవమానించడం దారుణమైన విషయమన్నారు. అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని అప్పటివరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో సీపీఐ పార్టీ వజ్రకరూరు మండల కార్యదర్శి డి.సుల్తాన్, కణేకల్లు కార్యదర్శి గౌస్, సీనియర్ నాయకులు పురిడి తిప్పయ్య, గెన్నే మల్లేసి, కాంగ్రెస్ నాయకులు కుడాల రమేష్, తోపుడు బండ్ల కార్మికుల సంఘం నాయకులు చెన్నరాయుడు, గంగాధర్, కూరగాయల వ్యాపారుల సంఘం నాయకులు అయ్యప్పరెడ్డి, శాంతి పాల్గొన్నారు.



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు

